# విషవలయం




దబ్బుమని కార్లోనించి కిందికి పడ్డాను. కోపంగా లేచి నిలబడి, "ఆగరా ప్రదీప్ !" అంటూ అరుస్తూ కొంచెం దూరం కారు వెంట పరిగెత్తాను. కారు ఆగకుండానే వెళ్ళిపోయింది. చుట్టూ చూసాను. బస్టాపులో జనం నా వంకే వింతగా చూస్తున్నారు. అదేదో చిన్నజోకులా, ఏమీ ఫరవా లేదన్నట్టు కూలాసాగా నవ్వబోయాను. ఏడుపొచ్చి పెదిమలు వాటంతటవే వంకరలుపోయాయి. ఎంత ఆపుకుందామనుకున్నా ఏడుపు ఆగడం లేదు.

దగ్గరలోనే వున్న పార్కులోకి నడిచి బెంచీ మీద కూలబడ్డాను. చెట్టంత మగవాణ్ణి, నిస్సహాయంగా ఏడవటం చాలా అవమానంగా అనిపిస్తుంది, కానీ కడుపులో దుఃఖమూ, గుండెల్లో దిగులూ నన్ను కుదిపేస్తున్నాయి. మోకాళ్ళలో తల దూర్చి పదినిముషాలు అలాగే ఏడుస్తూ కూర్చున్నాను. కొంచెం సేపయాక సంచిలోంచి సీసా తీసి మంచినీళ్లు తాగాను. సాయంత్రం ఆరవుతున్నట్టుంది. ఆకలీ, ఈ రాత్రికి ఎక్కడ పడుకోవటం అనే జోడు సమస్యలని గురించి ఆలోచించాలి. కానీ మనసు సునీల్ గురించి తప్పితే ఏమీ ఆలోచించనంటోంది. తల పగిలిపోతుంది. దీనికంతా సునీల్‌గాడే కారణం. సునీల్‌ని తలచుకోగానే మళ్లీ పెద్దపెట్టున ఏడుపొచ్చింది.

శారద

కళ్ళు తుడుచుకుని నావైపు చూసుకున్నాను. మాసిపోయిన గుడ్డలూ, పెరిగిన గడ్డం, తిండిలేక పీక్కుపోయిన మొహం, చెంపలు లోతుకుపోయి బయటపడ్డ కళ్లూ, తెగిపోయిన చెప్పులూ, బహుశా బూచాళ్ళాగున్నానేమో ! నేనేనా ? చిన్నప్పుడు నా పై తరగతి పిల్లలకి కూడా లెక్కలు చెప్తూ, చదువులో ఆటల్లో అన్నిట్లో ముందుంటూ, చురుగ్గా టీచర్లందరి ప్రేమకీ పాత్రుణ్ణయిన నేనేనా? లేక చచ్చిపోయి మళ్లీ వేరే జన్మలో వున్నానా ?

'నీ డ్రస్సూ, నువ్వూ, చురుగ్గా చూసే చూపులూ, హీరోలాగున్నావురా," ఆరాధనగా అనే సునీల్‌మాటలు గుర్తొచ్చాయి. నిన్న సాయంత్రం ప్రదీప్ వాళ్లింట్లో పార్టీలో ఒంటరిగా పడి వున్నానని తెలిసి నాకోసం పరిగెత్తుకొచ్చిన నేస్తం ! రాత్రంతా నా పక్కనే కూర్చోని నాకు హితబోధ చేసిన గురువు.

"ఎలాగైనా నీ పద్ధతి మార్చుకోరా ! ఇంట్లో అమ్మా నాన్నా, చెల్లీ అందరూ ఎంత బాధపడుతున్నారో అర్థం చేసుకో ! నా మాట విని నాతో రా ! ఇదేమీ తీర్చలేనంత పెద్ద భయంకరమైన సమస్యేమీ కాదు. నువ్వు మనసు పెట్టాలంతే !" అని చిలకకి చెప్పినట్టు చెప్పాడు. రాత్రంతా వాడు నిద్రపోయినా నాకు నిద్ర పట్టలేదు. భవిష్యత్తు గురించిన ఆలోచనలూ, గతాన్ని గురించిన జ్ఞాపకాలూ నా మీద చేసిన దాడిలో రాత్రంతా గడిచిపోయింది.

✿ ✿ ✿

ఇద్దరం చిన్నప్పట్నించీ కలిసి చదువుకున్నాం. పోటాపోటీగా ప్రిపేరయి ఐ.ఐ.టీ ఎంట్రన్సు పరీక్షలో నెగ్గి ఏనుగు కుంభస్థలాన్ని కొట్టినంత సంతోషపడ్డాము. మద్రాసు నగరంలో చదువుకోవటానికెళ్లి ఆ మహానగరంతో మా పల్లెటూరిని పోల్చుకుని "ఇక్కడెంత బాగుందిరా !" అనుకున్నాం. ఇద్దరం ఒకే హస్టలులో వుండలేమని తెలిసి వాడు ఏడుపు మొహం పెట్టాడు గానీ, నేను ధైర్యంచెప్పాను. "జన్మంతా నీ చేయి పట్టుకొని నడిపించడం నా వల్ల కాదురా ! ఇండిపెండెంటుగా వుండటం నేర్చుకో" అన్నాను గొప్పగా. నిజానికి చేయి పట్టుకుని తీసికెళ్లాల్సిన అవసరం నాకే గాని వాడికి లేదన్న విషయం నాకు చాలా కాలం తరువాత గానీ అర్థం కాలేదు. అప్పటికే జారుడు బల్లమీద నా జీవితం అదుపు తప్పిపోవటం మొదలైంది.

మొదటిసారి థర్డియర్లో సునీల్‌ని అడిగాను, "ప్రదీప్ వాళ్ళ రూంలో పార్టీ వుంది రమ్మంటున్నారు, వెళ్దామా?" అని. "వద్దురా, ఆ గుంపెందుకో నాకు నచ్చదు," నేననుకున్నట్టే అన్నాడు. మనసులో ఏదో ఒక బలహీనతని జయించలేక వాడికి చెప్పకుండా ప్రదీప్ రూంకి వెళ్ళాను ఆ రాత్రి. అలా వెళ్ళకుండా వుండి వుంటే ఈ పాటికి నా బ్రతుకిలా అయి వుండేదా?

పార్టీ చాలా రాత్రి వరకు బాగానే వుంది. వాళ్లు ఎంత బలవంతం చేసినా నేను బీరు తాగలేదు, మొండిగా కోక్‌బాటిల్ పట్టుకుని కూర్చున్నాను. ఆఖరి సారి అందరికీ మళ్లీ కోక్ వచ్చింది. ఇంకొక కోక్ కేన్ అందుకున్నాను. అందరూ తలా ఒకటి తీసుకుని, "ఇప్పుడు ఎవరు గెలుస్తారో చూద్దాం" అన్నారు. నాకర్థం కాలేదు. గెలుపేమిటి? ఆటేమీ ఆడటం లేదు కదా ? జంకుగా, బిడియంగా, నా పక్కనే వున్న రాజునడిగాను. పెద్దగా నవ్వాడు. "ఆ కోక్ తాగు, ఆటేమిటో నీకే తెలుస్తుంది," అన్నాడు ప్రదీప్. రోషంగా కోక్ నోట్లో పోసుకున్నాను. అందరూ కోక్ తాగేరు. మామూలుగానే వుంది. నేను భయపడ్డట్టు అందులో డ్రింకులేవీ కలపలేదు. కొంచెం సేపయాక కళ్ళు తిరుగుతున్నట్టనిపించి కోక్ కేన్ టేబిల్‌మీద పెట్టాను. అందరూ నా వంకే కుతూహలంగా చూస్తున్నట్టనిపించింది.

ఎందుకని అడగబోయాను. నోట్లోంచి మాట రాలేదు. పెద్దగా నవ్వటం మొదలుపెట్టాను. కళ్ళ ముందు రంగు రంగుల వలయాలు తిరుగుతున్నట్టూ, ఇంద్రధనస్సు మీదికి ఎక్కుతున్నట్టూ చాలా బాగుంది. ఇంత మనసారా నవ్వి ఎంత కాలమైందో! ఎవరేం జోకు చెప్పుతున్నారో అర్థం కావటం లేదు. అయినా పగలబడి నవ్వుతున్నాము అందరమూ, ఎందుకో మరి !

మర్నాడు ప్రదీప్ వచ్చి, "ఎలా వుంది ఇవాళ? రాత్రి పార్టీ నీకు నచ్చిందా?" అన్నాడు. "పార్టీ సరే గాని, అదేదో ఆట అన్నావు, ఆడనేలేదే?" అడిగాను నిద్రమత్తులోనే. "ఆడకపోవటమేమిటి? ఆడేము, నువ్వే గెలిచావు కదా?" "నేను గెలిచానా? నాకు గుర్తు రావటం లేదే" అయోమయంగా అడిగాను. "వెర్రి నాయనా ! రాత్రి మనం ఆడిన ఆట కొత్తరకం ఆట. అన్ని కోక్ బాటిల్సూ ఒకే లాగున్నా, అందులో ఒక్కదానిలో మారివానా కలిపాను. ఎవరికి మారివానా కలిపిన బాటిల్ వస్తే వాళ్లు గెలిచినట్టు. రాత్రి అందుకే నువ్వలా రెచ్చిపోయావు. ఎలా వుంది మొదటిసారి, కొత్తరకం కోక్? స్వర్గంలో విహరిస్తున్నట్టు అనిపించలేదా?" ఒక్క క్షణం మనసు భయంతో మొద్దుబారి పోయినట్టయింది. నేను డ్రగ్స్ తీసుకున్నానా? ఇంట్లో తెలిస్తే చంపేస్తారు. అమ్మా నాన్నా గుండె ఆగి చచ్చిపోతారు. ఇంకెప్పుడూ ఈ ప్రదీప్ గేంగ్‌తో మాట్లాడొద్దు. లేచి పరిగెత్తుకుని సునీల్ దగ్గరికెళ్లి సంగతంతా చెప్పాను.

జరిగిందంతా విని సునీల్ ఏమీ అనలేదు. నాలుగు రోజులు నన్ను అంటిపెట్టుకునే ఉన్నాడు. రెండు నెలల తరువాత వాళ్ల అక్కయ్య పెళ్లికి వెళ్తూ నన్ను రమ్మన్నాడు. ఊరికే క్లాసులు పోతాయన్న భయంతో వద్దన్నాను. ఒంటరితనం, పరీక్షల టెన్షన్,



ఎక్స్‌రే సాహిత్య సాంస్కృతిక సంస్థ, విజయవాడ వారి ఆధ్వర్యంలో నెల నెలా జరిగే 'నా కవిత్వంలో నేను' శీర్షికన తన కవిత్వం - జీవితంపై ప్రసంగించిన ప్రముఖ స్త్రీవాద కవయిత్రి మందరపు హైమవతిని సన్మానిస్తున్న ఎక్స్‌రే అధ్యక్షులు శ్రీ కొల్లూరి, శ్రీ ఆంజనేయకుమార్, శ్రీ ఆంజనేయరాజు, శ్రీమతి టి. వనజ.

మానసిక బలహీనత అన్నీ నన్ను ప్రదీప్ వైపు తోసాయి. సునీల్ ఇంటినించి వచ్చింతరువాత వాడికేమీ చెప్పలేదు. వాడే ఆరునెలల్లో కనిపెట్టాడు. అప్పటికి ఫైనల్ ఇయర్లోకి వచ్చాము.

"వద్దురా ! ఆ డ్రగ్స్ జోలికి వెళ్లి ఆరోగ్యమూ భవిష్యత్తూ అన్నీ పాడు చేసుకుంటున్నావు." ఎన్నోసార్లు చెప్పాడు సునీల్. నా హాస్టల్‌రూం తన పక్కకే మార్పించుకుని నన్ను పగలూ రాత్రి వెన్నంటి వున్నాడు. వాడిదేం తప్పు లేదు. వాడు నా కోసం చేయగలిగిందంతా చేసాడు. నేనే, మంచీ చెడూ విచక్షణ పోగొట్టుకొన్నాను. మారాలనే ఆశా, ఆసక్తీ నాకు లేనప్పుడు ఎంతమంది ఎన్ని విధాల చెప్పినా లాభం లేదు. నా మొహం చూసి వాడు మా ఇంట్లో ఈ సంగతులేవీ చెప్పలేదు. ఆఖరి సెమిస్టరు అన్ని సబ్జెక్టులూ ఫెయిల్ అయిన సంగతి కూడా. వాడు చదువు పూర్తి చేసుకుని, నేను చదువు వదిలేసుకుని కేంపస్ నించి బయటపడ్డాము.

✿ ✿ ✿

నెలరోజులలో నా పరిస్థితి అర్థం చేసుకున్న మా నాన్నగారు సునీల్ ఇంటికెళ్ళి వాణ్ణి చెంప పగలగొట్టారు.

"నా తప్పే అంకుల్ ! నేనే ఇంకా వాణ్ణి ఎక్కువగా కనిపెట్టి వుండాల్సింది" అని బాధపడ్డాడు. ఆరునెలలు నా కోసం అహోరాత్రులూ ఎక్కడెక్కడివో డీ – అడిక్షన్ కార్యక్రమాల వివరాలు తెచ్చాడు. నా బలహీనత జయించాలన్న ప్రయత్నం నా వైపు నించి ఏమీ లేకపోగా, నాకు మత్తు మందులకొరకు డబ్బు కోసం నేను స్కూలు పిల్లలకు మత్తుమందులు అమ్మటం మొదలుపెట్టాను. ఆ సంగతి తెలిసినప్పుడు మాత్రం మొదటిసారి నా మీద చేయి చేసుకున్నాడు సునీల్. "దరిద్రుడా ! నీకు పట్టిన పీడ అందరికీ పట్టిస్తున్నావా ! దీనికంటే నువ్వు చస్తేనే మా కందరికీ శాంతి" అన్నాడు.

ఆ తరువాత మరి రెండు నెలలు వాడు నా మొహం చూడలేదు. నేను పూర్తిగా మత్తు మందులకీ, వాటికోసం ప్రదీప్‌కీ బానిసయిపోయాను. స్కూలు పిల్లలని చూస్తే మాత్రం సునీల్ కొట్టిన దెబ్బలు గుర్తొచ్చి చెంప చురుక్కుమంటుంది.

ఇంటికెళ్తే కుమిలిపోతున్న అమ్మా, నాన్నల మొహాలు ! వాళ్లకి ధైర్యం చెప్పి తనే నీరు కారిపోతున్న చెల్లి ! అందాల పూల పడవలాంటి మా ఇంటిని ఈ తుఫానులోకి నెట్టింది నేనే అనుకుంటే నాకు చావటానికీ, బ్రతకటానికీ ధైర్యం చాలటం లేదు. ఎన్ని ఆశలు పెట్టుకున్నారు వాళ్లు నా మీద. పెద్దచదువులు చదివి ఇంటికీ, వంశానికీ పేరు తెస్తాననీ, సంఘానికుపయోగపడే పనులు నేను చేస్తుంటే వాళ్లు గర్వపడాలనీ,నా ప్రేమా ఆప్యాయతల నీడలో చల్లగా సేద దీరాలనీ, ఎన్ని కలలు కన్నారో, పాపం ఆ పిచ్చివాళ్లు. ఆ కలలన్నిటిమీదా నీళ్లు చల్లి వాళ్ల కడుపుల్లో ఆరని మంట పెట్టాను నేనే !

ఇలా అనుకున్నప్పుడు ఎలాగైనా ఆ మాదక ద్రవ్యాల మత్తులో నించి బయటపడాలని అనిపించేది. కానీ, నన్ను చూస్తే నాకే కలిగే అసహ్యాన్ని తట్టుకోవటానికే నేను మళ్లీ మత్తు మందులని ఆశ్రయించానేమో!

నిన్నరాత్రి ప్రదీప్ పెళ్లి రిసెప్షన్ అని తెలిసి పిలవకపోయినా వెళ్లాను. నన్నూ నా వాలకాన్నీచూసి అందరూ అసహ్యంగా మొహం పెట్టారు. నన్ను ఒక గదిలో పెట్టి తాళం వేసి, అందరూ వెళ్లాక సునీల్‌కి ఫోన్ చేసాడు ప్రదీప్. మాట్లాడకుండా సునీల్ వెనకే వాడి ఇంటికెళ్లాను.

"రేపు నాతో బాటు రాకపోతే నన్ను చంపుకు తిన్నంత ఒట్టే !" పడుకునే ముందు వాడు నాతో అదొక్కటే మాట అన్నాడు. ఆఫీసుకి సెలవు కూడా పెట్టాడు. కానీ పాపం, ఏదో అర్జంటు పనని ఫోనొచ్చింది. "ఎక్కడికీ వెళ్లకుండా ఇక్కడే వుండు" అని నాతో ఒట్టేయించుకుని వెళ్ళాడు. వుండాలనే అనుకున్నాను. వున్నాను మధ్యాహ్నం రెండింటివరకూ. కానీ నరాలు తోడేస్తున్నంత బాధ. ఒక్కసారి, ఇంకొక్కసారి తీసుకుంటే, సాయంత్రం డాక్టరు దగ్గరికెళ్లినప్పుడు ఈ బాధకి వేరేదైనా మందు అడగొచ్చు ! నాకు నేనే నచ్చచెప్పుకున్నాను. మళ్లీ ప్రదీప్ దగ్గరకెళ్లాను.

వాడు "నాతో రా !" అని కార్లో తీసుకెళ్తూ దారిలో నన్ను తోసి వెళ్లిపోయాడు. ఇప్పుడు నాకు సునీలూ వద్దు, వాడిస్నేహమూ వద్దు. మత్తుమందు, ఒక్క చిన్న డోసైనా చాలు. ఆ మత్తులో నా కళ్లముందు రంగు రంగుల్లో తిరుగాడే వలయాలు, ఎంత అందంగా వుంటాయవి. ఆ వలయాలు చూస్తుంటే ఎంతటి శాంతి,ఎంతటి వుత్సాహం, ఎంత సంతోషం! వాటినందరూ విషవలయాలంటారెందుకో ! ఈ వలయంలోంచి నేనెప్పుడైనా బయటపడతానా? ఏమో!


74 మంది లబ్ధప్రతిష్టులైన రచయితల అపురూపమైన రచనలతో
రూ.50/-ల 200 పేజీల చినుకు ప్రత్యేక సంచిక
ప్రత్యేక డిస్కౌంటుతో రూ.40/-లకే.
కావాల్సినవారు ఎం.ఓ.చేయండి. పోస్టల్ చార్జీలు ఉచితం


**పాఠక సూచన :**

సుప్రసిద్ధ గ్రంథాలను సంప్రదించి / ఉపయోగించి, అందులోని అవసరమైన విషయాలను వ్యాసరచనల్లో ఉపయోగించుకోవడం జరుగుతుంది. అది తప్పు కాదు; అవసరం కూడ. గతకాలపు జ్ఞానసంపదను భవిష్యత్తుకు అందించడం జరుగుతుంది. సంప్రదించిన / ఉపయోగించిన గ్రంథాలను, ఆ గ్రంథ రచయితల పేర్లను వ్యాసం చివర సౌజన్యంతో పేర్కొనడం జరుగుతుంది. ఇది సాహిత్య నైతిక సంప్రదాయంగా వందల ఏళ్లనుంచి స్థిరపడింది. ఈ మధ్యకాలంలో చాలా పత్రికల్లో అప్పుడప్పుడు అక్కడక్కడ ఈ విశిష్టమైన సంప్రదాయాన్ని రచయితలు పక్కన పెట్టేస్తున్నట్లు కనబడుతోంది. దీనివల్ల ఏం జరుగుతుంది? వ్యాసంలోని అన్ని విషయాలూ, నిర్ధారణలూ, వ్యాసరచయిత / రచయిత్రివే అన్న అభిప్రాయం పాఠకుల్లో కలుగుతుంది. ఇది మొదటి తప్పు ఔతుంది. ఎంతో శ్రమించి, కష్టించి, పరిశోధించి, నిగ్గుతేల్చి నిర్ధారించి రచించిన / గ్రంథస్థం చేసిన విషయాలు, సూత్రీకరణలు ఎవరివో చెప్పకపోవడం వల్ల ఆ మేధావులకు జరిగే హాని, నష్టం ఏమౌతుంది? రెండో తప్పు ఔతుంది. వందల ఏళ్లనుంచి స్థిరపడిన ఈ సంప్రదాయం అందరికీ తెలుసు. తెలిసుండి కూడ ఆచరించకపోవడం ఏమౌతుంది? మూడో తప్పు ఔతుంది. ఈ మూడు తప్పుల అనైతిక నేరాల మొత్తం కలిపితే ఏమౌతుందో అందరికీ తెలుసు ! ఇది ఎవరినీ ఉద్దేశించి గుర్తు చేసిన విషయం కాదు ; గుర్తు చేయడం కోసమే గుర్తు చేయదమైనది. ఇంటర్‌నెట్ సదుపాయాల దుర్వినియోగంలో ఈ సమస్య తీవ్రమౌతోంది.

– జయంతి పాపారావు... విశాఖపట్టణం.